# వీధి కుక్కలకు ఆపరేషన్లు

### సంఖ్య పెరుగుదల నియంత్రణకు జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు

### దాదాపు 75 శాతం మేర శునకాలకు యానిమల్ బర్త్ కంట్రోల్, రేబిస్ వ్యాక్సిన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో వీధి కుక్కల సంఖ్య పెరుగుదల నియంత్రణకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రామ్ నిర్వహిస్తూనే, రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నది. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ జరుపుతున్నామని, జీహెచ్ఎంసీ పరిధిలో ఏడాది క్రితం 5.7లక్షల కుక్కలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. 75శాతం కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు పూర్తయినట్లు తెలిపారు. మహదేవ్‌పురలో 2021–22 సంవత్సరంలో 15, 077, 2022–23లో 7,554, 2023–24 సంవత్సరంలో 11,440 వీధికుక్కలకు ఆపరేషన్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జోన్‌లో 90 శాతం స్టెరిలైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని కుక్కలను యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

### యానిమల్ వెల్ఫేర్ బోర్డు నిబంధనల ప్రకారం..

దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా(ఏడబ్ల్యుబీఐ) నిబంధనలకు లోబడి యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ), యాంటీ రేబిస్(ఏఆర్) కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జోన్‌కి ఒకరు చొప్పున వెటర్నరీ డాక్టర్లు ఉండగా, ప్రైవేటు డాక్టర్ల ఆధ్వర్యంలో ఐదు యానిమల్ కేర్ సెంటర్లు ఫతుల్లాగూడ, చుడిబజార్, పటేల్‌నగర్, కేపీహెచ్‌బీ కాలనీ, మహదేవ్‌పూర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ముందు గా కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించిన తరువాత నాలుగైదు రోజులపాటు వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అనంతరం వాటిని ఎక్కడ పట్టుకున్నారో అక్కడే వదిలివేయడం ఆనవాయితీ. ఆపరేషన్ నిర్వహించిన కుక్కల కుడి చెవికి వీ ఆకారంలో మార్క్ వేసిన తరువాత వదిలివేస్తారు. దీని వల్ల సదరు కుక్కకి ఆపరేషన్ నిర్వహించినట్లు గుర్తించే వీలు కలుగుతుంది. ప్రస్తుతం డాక్టర్లకు ఒక్కో ఆపరేషన్‌కు ఫీజు ఇస్తుండగా, ఆపరేషన్ థియేటర్‌తోపాటు అన్ని సౌకర్యాలు జీహెచ్ఎంసీయే భరిస్తున్నది.

# ఏనుగు V/S బొక్క

# కిమ్మనని కిచ్చన్న

- కందుకూరు కాంగ్రెస్‌లో బయటపడ్డ విభేదాలు
- మాకు అవమానం.. వారికి అందలమా.. అంటూ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని నిలదీసిన నేతలు
- రసాబాసగా మారిన ఆత్మీయ సమావేశం
- గందరగోళం మధ్యనే.. జారుకున్న మాజీ ఎమ్మెల్యే
- జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి చేరికతోనే లొల్లి
- నాయకులు, కార్యకర్తల మధ్యన తోపులాట
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



కందుకూరులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గొడవ పడుతున్న కార్యకర్తలు, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 14 : కందుకూరు కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వ్యవహార తీరుపై మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి మండిపడ్డారు. తనకు సమాచారం లేకుండా జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిని పార్టీలోకి ఎలాతీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా ఎమ్మెల్యే టికెట్ ప్రయత్నించానని.. అదృష్టం బట్టి మీకు టికెట్ వచ్చిందని.. అంత మాత్రన ఉలిక్కి పడడం తగదని పేర్కొన్నారు. ఆదివారం టంకిరి రాంరెడ్డి ఫంక్షన్ హల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం రసాబాసగా మారింది. నాయకులు, కార్యకర్తలు సమావేశంలో రచ్చరచ్చ చేశారు. మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి మాట్లాడుతుండగా తమకు అవమానం జరుగుతుందని కందుకూరు మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు అడ్డుపడ్డారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు చేతులు వేసుకునే స్థాయికి పోయింది. తనకు జరుగుతున్న అన్యాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయానని, కేఎల్ఆర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో తనకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. రెండు రోజుల కింద పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని., ఎవరిని అడిగి జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిని పార్టీలోకి తీసుకున్నారని ప్రశ్నించారు. ఎక్కువ శాతం కార్యకర్తలు, నాయకులు కేఎల్ఆర్‌పై అసహనం వ్యక్తం చేయడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. ఉప ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి కూడా తనకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి కల్పించుకొని తనకు అందరూసమానమేనని, కలిసి మెలిసి ఉందామని చెప్పి సమావేశం నుంచి వెళ్లి పోయారు. దీంతో పోలీసులు కలుగజేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. కాంగ్రెస్‌లో ఉన్న విభేదాలు బయటపడడంతో ఎంపీ అభ్యర్థిని ఎలా గెలిపిస్తారని పలువురు చర్చించుకున్నారు.

# మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరేద్దాం..

- నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- ఎమ్మెల్యే కృష్ణారావు



కేపీహెచ్‌బీ కాలనీలో బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 14 : గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి మల్కాజిగిరి పార్లమెంట్‌లో గులాబీ జెండా ఎగురవేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజ్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోరుతూ కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ వైపు అభివృద్ధి, మరోవైపు పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందించారని కొనియాడారు. గత పదేండ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేలాది కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా ఏకపక్షంగా బీఆర్ఎస్ పార్టీని ఆదరించారని కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి భారీ మెజార్టీని అందించాలని కోరారు. ముందుగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, అడుసుమల్లి వెంకటేశ్వర్‌రావు, సురేశ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, నరసింగరావు, పీ. గోపి, రాజేశ్‌రాయ్, సాయిశ్రీనివాస్, జీఎల్ఎన్ రెడ్డి, భారతి, భవానీ, రమాదేవి, లత, పద్మారెడ్డి, పద్మ, కుమారి, అనూరాధ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సేవలు.. అందరికీ ఆదర్శం

### రాజ్యాంగ రూపకర్త జయంతి కార్యక్రమంలో వక్తలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : భారత రాజ్యాంగ రూపకర్త, భారత రత్న, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి కార్యక్రమంలో ఆదివారం నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.

### జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో...



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమిషనర్లు శ్రీవాస్తవ, నళిని పద్మావతి, కె.సత్యనారాయణ, యాదగిరి రావు, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, లేబర్ పర్సనల్ ఆఫీసర్ వెంకట భాస్కర్‌రెడ్డి తదితరులు

### హైదరాబాద్ కలెక్టరేట్‌లో..



హైదరాబాద్ కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.కదిరవన్, డీఆర్ఓ వెంకటాచారి, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సీఎస్ఐఆర్ ల్యాబోరేటరీల ఆధ్వర్యంలో..



సీఎస్ఐఆర్ ఎన్‌జీఆర్ఐ, సీసీఎంబీ, ఐఐసీటీ, ఐఐసీటీ సంయుక్తంగా అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.సీతారామ రావు, ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్, సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరిశోధకులు గంగాగ్నిరావు, ఏఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### జలమండలి ప్రధాన కార్యాలయంలో..



ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎండీ సుదర్శన్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్మిక నాయకులు రామస్వామి, లక్ష్మీనారాయణ, సీజీఎం పద్మజ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు, డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, స్వామి, సీజీఎం, జీఎం, వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, జలమండలి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, ప్రతినిధులు విశ్వనాథ్, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


### లోయర్ ట్యాంక్‌బండ్‌లో..

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. జీహెచ్ఎంసీ అధ్యక్షుడు కాట్రావల్ గోపాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హంసరాజు, కందుల అర్జున్, జీమకల శేఖర్, పరుశురాం, దబ్బల కృష్ణ, మహేశ్, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# 50శాతం రిజర్వేషన్లు పెంచాలి

గోల్నాక, ఏప్రిల్ 14 : పంచాయతీ రాజ్ శాఖలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ వాటాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50శాతం రిజర్వేషన్లు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఆదివారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుజ్జ కృష్ణయ్య, భరత్, నీల వెంకటేశ్, సత్యం, రాజేందర్, రామకృష్ణ, జయంతి, బలరామ్, శివ, అరవింద్, రాకేశ్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.





ఆద్య జూనియర్ కళాశాల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని విజేతలకు పతకాలను అందజేస్తున్న టీఎస్ఆర్టీసీ డీవీఎం, జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు జి.కిరణ్ రెడ్డి



కెనడాలోని టోరంటో నగరంలో కొండపల్లి శేషగిరి రావు శత జయంతోత్సవాల సందర్భంగా పుస్తకావిష్కరణలో ప్రముఖులు

# తెలంగాణ క్లినికల్ సైకాలజి అసోసియేషన్ అధ్యక్షులుగా డా.సరోజ ఆర్య



సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ క్లినికల్ సైకాలజి అసోసియేషన్ అధ్యక్షులుగా డాక్టర్ సరోజ ఆర్య ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా డాక్టర్ సరోజ ఆర్య, ప్రధాన కార్యదర్శిగా శిల్ప పన్నాల్ ఎన్నికయ్యారు.

# నమ్మకాన్ని.. వమ్ము చేయకండి సారూ..!

### హెచ్ఎండీఏ చేసిన లేఅవుట్ అని..కోట్లు వెచ్చించి ప్లాట్లు కొన్నాం..

### ప్రభుత్వం మారగానే టెండర్లు రద్దు

### బహదూర్‌పల్లి, బాచుపల్లిలోని లేఅవుట్‌లలో అభివృద్ధి పనులు చేపట్టాలని కొనుగోలు దారుల వేడుకోలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఏర్పాటు చేసే లేఅవుట్ అంటే ప్రజలకు ఎంతో నమ్మకం. మాస్టర్ ప్లాన్ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో సమగ్ర మౌలిక వసతులతో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి అప్పగిస్తారన్న మంచి పేరు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)కి ఉంది. ఇప్పటికే నగరంలో పలు చోట్ల అభివృద్ధి చేసిన లేఅవుట్‌లే అందుకు నిదర్శనం. అలాంటి హెచ్ఎండీఏ బహదూర్‌పల్లి, బాచుపల్లిలో ప్రతిపాదించిన లేఅవుట్‌లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మారడంతో అందులో ప్లాట్లు ఉన్నవారు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా హెచ్ఎండీఏ వెంచర్‌లో ప్లాట్లు అని లక్షలు చెల్లించి కొనుగోలు చేశాం.. నెలలు గడుస్తున్నా లేఅవుట్లలో చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక వసతులను కల్పించడం లేదు. బహదూర్‌పల్లిలో 40ఎకరాల విస్తీర్ణంలో, అదే విధంగా బాచుపల్లిలో 27 ఎకరాల్లో ప్రతిపాదించిన లేఅవుట్‌లలో ప్లాట్లను ఆన్‌లైన్ ద్వారా విక్రయించింది. ఆ తర్వాత ఆ రెండు లేఅవుట్‌లలో చేపట్టాల్సిన లేఅవుట్ అభివృద్ధి పనులు మాత్రం ఇప్పటికీ చేపట్టడం లేదు. కేవలం బుద్వేల్, మోకిల లేఅవుట్‌ల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచిన హెచ్ఎండీఏ వాటిని ఒకే కంపెనీకి సుమారు రూ.400 కోట్లకు అప్పగించింది. అదేసమయంలో బహదూర్‌పల్లి, బాచుపల్లిలోని లేఅవుట్‌లలో అభివృద్ధి చేసేందుకు పిలిచిన టెండర్లను మాత్రం రద్దు చేశారు. దీంతో ఆ రెండు లేఅవుట్లలో పాట్లను కొనుగోలు చేసిన యజమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది.



### నాలుగు నెలలు గడుస్తున్నా..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి హెచ్ఎండీఏ పరిధిలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. గతేడాది ఎన్నికల కోడ్ మూలంగా నవంబర్, డిసెంబర్ నెలల నుంచే అభివృద్ధి పనులు నిలిచిపోగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా ప్రాజెక్టులను పూర్తిగా పక్కన పెట్టింది. గతమెంతో ఘనం అన్నట్లుగా ఉండే హెచ్ఎండీఏలో ఇప్పుడు అంతా గప్ చుప్ అన్నట్లుగా ఎక్కడి వారు అక్కడే ఉన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, పనుల్లో మాత్రం చలనం లేదు. నగర శివారు ప్రాంతాల్లో హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్ల వంటి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4నెలలు గడుస్తున్నా క్షేత్ర స్థాయిలో ప్రతిపాదిత ప్రాజెక్టులపై దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా హెచ్ఎండీఏ లేఅవుట్‌లలో ప్లాట్లను ఆన్‌లైన్‌లో వేలం ద్వారా విక్రయించి సొమ్ము చేసుకున్నా, క్షేత్ర స్థాయిలో లేఅవుట్‌లో మాత్రం కనీస సౌకర్యాలైన రోడ్లు, మంచి నీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతులను ఎందుకు కల్పించడం లేదంటూ కొనుగోలు దారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా హెచ్ఎండీఏ అధికారులు స్పందించి బహదూర్‌పల్లి, బాచుపల్లిలోని లేఅవుట్‌లను అభివృద్ధి చేసి తమకు అప్పగిస్తే అక్కడ గృహ నిర్మాణాలు చేసుకుంటామని కొనుగోలు దారులు అభిప్రాయపడుతున్నారు.